క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళం



సదాశివనగర్: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని సీఐ రామన్ సూచించారు. సదాశివనగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు మండల రైస్ మిల్ నిర్వాహకులు రూ.2.50 లక్షల విరాళాన్ని సీఐకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తోట రాజేశ్, సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ముందుంటాం



కామారెడ్డి టౌన్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన పలు వార్డుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని వెల్లడించారు. ఆయన వెంట కౌన్సిలర్లు ఉర్దొండ వనిత, కృష్ణాజిరావు తదితరులు ఉన్నారు.

సంక్షేమానికి కృషి



దోమకొండ: జిల్లాలోని క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తానని పాస్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాప శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో గుడ్ ఫ్రూట్ మినిస్ట్రీట్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు బట్ట రాములు, ట్రస్టు సభ్యులు బట్ట శివరాములు, పుట్ట మోహన్‌రెడ్డి, మార్కు, రాజయ్య, రాజు, ప్రేమ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పతకాల పంట



కామారెడ్డి అర్బన్: హనుమకొండలో శని, ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మూడు స్వర్ణ, రెండు రజత, మూడు క్యాంస పతకాలు సాధించారు. అండర్-20 బాలుర విభాగం 3 వేలు, 5 వేల మీటర్ల పరుగులో కె. అనిల్ రెండు స్వర్ణపతకాలు, అండర్-18 బాలికల విభాగం 1,500 మీటర్ల పరుగులో బి.హరిత స్వర్ణం, అండర్-18 బాలుర 400 మీటర్ల పరుగులో ఆర్.సేవాగ్ కాంస్య పతకం సాధించారు. అదేవిధంగా అండర్-20 బాలుర లాంగ్‌జంప్‌లో ఆర్.రవీందర్ నాయక్ కాంస్య పతకం, అండర్-20 బాలికల 800, 1,500 మీటర్ల పరుగులో బి.అర్చన కాంస్య, రజత పతకాలు సాధించారు.

రంజాన్ కానుకల పంపిణీ

బిచ్కుంద: మండలంలోని మిషన్ కల్లాలి, బిచ్కుందలో ఆదివారం ముస్లింలకు సర్పంచ్ సంజీవ్ పటేల్ రంజాన్ కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల వారు పండుగలను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండగలకు ప్రభుత్వం బట్టలు పంపిణీ చేస్తోందన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మినర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన సూర్యమోహన్‌రెడ్డి, సురేఖ దంపతులు రూ. 10 వేల విరాళంగా అందజేశారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి: మండలంలోని క్రిష్ణాజివాడి శివారులో ప్రధాన రహదారిపై ఆదివారం పోలీసుల వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా విధించారు.

ఉపాధి పనులకు ధరఖాస్తు చేసుకోవాలి

లింగంపేట: ఉపాధి పనుల కోసం కూలీలు ధరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. గ్రామాల్లో గుర్తించిన పనులకు కూలీలు ధరఖాస్తులు చేసుకుంటే వెంటనే పనులు కల్పిస్తామని అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం లింగంపేటలో దండోరా వేయించారు.

ఊరిస్తున్న మూడు లక్షల పథకం





శాంతాపూర్ గ్రామంలో రేకుల షెడ్లల్లో నివసిస్తున్న చిన్న సాయిలు, ఒడ్డింటి అంజవ్వ

- ఇంటి స్థలం ఉంటే నిర్మాణానికి నిధులిస్తామన్న సర్కార్
- ఎదురు చూస్తున్న పేదలు
- పలు కుటుంబాలు గుడిసెలు, షెడ్లలోనే నివాసం

నిజాంసాగర్: సొంతంగా స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకుంటే రూ. 3 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని పాలకులు పదేపదే చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదు. సొంతింటి కల కోసం ఎదురు చూస్తున్న పేదలకు కలగానే మిగులుతోంది. డబుల్ బెడ్రూం తరహాలో రూ. 3 లక్షల పథకం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అమలు కావడం లేదు. గతంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తామని ప్రకటించినా ఆర్థికభారం ఎక్కువవుతోందని ప్రభుత్వం భావించి ఆ విధానానికి స్వస్తి పలికి సొంతంగా ఇంటి నిర్మాణం చేసుకునేవారికి రూ. 3 లక్షలు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో సహాయం పేదలు ఎదురు చూస్తున్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, జుక్కల్, మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద మండలాల్లో ఐదు వేల ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఇప్పటికే పలు సభల్లో ప్రకటించారు. దీంతో ఇళ్లులేని వారు గ్రామాల వారీగా సొంతింటి నిర్మాణానికి పేదలు పోటీపడుతున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సొంతిళ్లు లేక కొందరు అద్దె భవనాల్లో, మరికొందరు, పూరిగుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్నారు. ఇలాంటి వారందరూ కూడా రూ. 3 లక్షల పథకం ఎప్పుడు అమలు చేస్తారోనని ఎదురు చూస్తున్నారు.

కల నెరవేరేదెప్పుడో..



రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం ప్రకటించినట్లు రూ. 3 లక్షల పథకం అమలు చేస్తే సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటాం. సొంతింటి కల కోసం ఎన్నో ఎళ్లుగా ఎదురు చూస్తున్నాం.

–ఒడ్డింటి అంజవ్వ, శాంతపూర్

డబుల్ బెడ్రూం ఇళ్లు ఏవీ?



రిలే నిరాహార దీక్షలో బీజేపీ నాయకులు

మద్నూర్: పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని అబద్ధపు మాటలు చెప్పి గద్దెనెక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు హన్మండ్లు సూచించారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా హన్మండ్లు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు హన్మంత్ సింధేను వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించుకున్నా ఆయన పేదలకు చేసిందేమీ లేదన్నారు.

దేవునిపల్లిలో ఇఫ్తార్ విందు



కామారెడ్డి రూరల్: రంజాన్ మాసం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో కౌన్సిలర్లు కాసర్ల గోదావరిస్వామి, పోలీస్ క్రిష్ణాజీరావు ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మతాలకతీతంగా ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలని సూచించారు.

సమాజం కోసం పాటుపడాలి



సంతోష్‌ను అభినందిస్తున్న దళిత నాయకులు

బాన్సువాడ రూరల్: మేధావులు, ఉద్యోగులు దళిత సమాజానికి సేవ చేయడానికి పునరకితం కావాలని దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ నాయకులు బంగారు రవి కోరారు. దేశాయిపేట్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంతోష్ దళితరత్న అవార్డు అందుకున్న సందర్భంగా ఆయన్ను అభినందించారు. దళితుల ఐక్యత, అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయం అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు గంగాధర్, గోవర్ధన్, రాములు, శ్రీకాంత్, సుభాష్, గంగాధర్,మోచి రాజు మోహన్, బాలయ్య, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరే క్షత్రియులు ఐక్యంగా ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతి చక్రపాణి బాబా

సదాశివనగర్: ఆరే క్షత్రియులు ఐక్యంగా ఉండాలని పీఠాధిపతి చక్రపాణి బాబా సూచించారు. ఆదివారం మండలంలోని లింగంపల్లి శ్రీకృష్ణ మందిరంలో మండల స్థాయి ఆరె క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతకు ముందు మందిరంలో చక్రపాణి బాబా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ గొప్ప తనాన్ని వివరించారు. సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఎల్లారెడ్డిరూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై పట్టణంలోని పలు ఆస్పత్రుల్లో అగ్ని మాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దూడలకు గడ్డి విరాళంగా ఇవ్వండి

భిక్కనూరు: రైతులు పొలాల్లో వరిగడ్డిని కాల్చివేయకుండా సిద్ధరామేశ్వరాలయంలోని కోడేదూడల ఆహారం కోసం గడ్డిని విరాళంగా ఇవ్వాలని ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అందే మహేందర్‌రెడ్డి కోరారు.

ఆధ్యాత్మికం

ఆలయ వార్షికోత్సవానికి హాజరు కావాలని మంత్రికి ఆహ్వానం



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో వచ్చే నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి 5వ వార్షికోత్స ఉత్సవాలకు హాజరు కావాలని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌లను హైదరాబాద్‌లో స్థానికులు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. లింగాపూర్‌కు చెందిన కొమిరెడ్డి పెద్ద నారాయణ, బండారి నర్సారెడ్డి, రాంరెడ్డి, యాదవరెడ్డి, షానూర్, పటేల్ నర్సింలు, అంజిరెడ్డి, కాసర్ల శ్రీనివాస్, కాశయ్య తదితరులు వారిని కలిశారు.

■ అఖండ హరినామ సప్తాహం ప్రారంభం



నిజాంసాగర్: జుక్కల్ మండలం బస్వాపూర్ బసవేశ్వర మందిరంలో ఆదివారం నుంచి ఏడు రోజుల పాటు అఖండ హరినామ సప్తాహం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రవీపటేల్ తెలిపారు. 22న అక్షయ తృతీయ, బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

■ పెద్దమ్మ తిరుగుబోనాలు



దోమకొండ: మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా తిరుగుబోనాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద గావుపట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మన్, ప్రతినిధులు పెద్ద బాలయ్య, సత్యం, నాగారపు రాజు, కామిండ్ల నర్సింలు, కామిండ్ల కృష్ణ, పున్న రాములు, పులబోయిన శంకర్ పాల్గొన్నారు.

■ వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



భిక్కనూరు: కాలజ్ఞాని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గంప రాజేశం, రాధబాయి దంపతుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి జిల్లా నుంచే కాకుండా రామాయంపేట, సిరిసిల్లా హైదరాబాద్, నల్గొండ, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు చెందిన వారు హాజరయ్యారు.

■ ఘనంగా అమ్మవారికి బోనాలు

నిజాంసాగర్(జుక్కల్): హసన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి వార్షికోత్సవం సందర్భంగా, ముగ్దుంపూర్ గ్రామాల్లో నల్ల, ముత్యాల పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఇంటికి ఒకరు చొప్పున బోనంతో ఊరేగింపుగా బయలుదేరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు సంగమేశ్వర్‌గౌడ్, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కార్యవర్గం..

■ ఏకోపాధ్యాయ పాఠశాల నూతన కార్యవర్గం ఎన్నిక



బాన్సువాడ : ఏకోపాధ్యాయ పాఠశాల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కిష్టయ్య, అధ్యక్షులు గాజుల రాజులు, ఉపాధ్యక్షులుగా రమేష్‌గౌడ్, కార్యదర్శిగా పాలకుర్తి విఠల్, కోశాధికారిగా విఠల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శిగా మల్లికార్జున్, సహాయ కార్యదర్శిలుగా అరవింద్, రవి, మహిళ ప్రముఖ్‌గా పైడివార్ సంగీత, పవిత్ర, విజయలక్ష్మీ, యువ ప్రముఖ్‌గా సాయికృష్ణను ఎన్నుకున్నారు.

■ ఎమ్మార్పీఎస్ టీఎస్ మండల కమిటీ..



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమయ్య ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సర్వగల్ల రవీందర్, ఉపాధ్యక్షుడు జోగిని బలరాం, కార్యదర్శి పండరి, గౌరవ అధ్యక్షుడిగా మేతరి సాయిలు, సలహాదారులుగా అలిగే దేవయ్యను ఎన్నుకున్నారు.

■ వీరశైవ లింగాయత్ మహిళా సంఘం..

బాన్సువాడ : వీరశైవ లింగాయత్ మహిళా సంఘం అధ్యక్షురాలిగా మిన్నూరి మహాదేవి, ఉపాధ్యక్షులుగా అనిత, శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీలత, కోశాధికారిగా అశ్విన్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా లక్ష్మీ, నందిని ఎన్నికయ్యారు. 16 బియన్‌డబ్ల్యు 103: వీరశైర లింగాయత్ కార్యవర్గ సభ్యులు

■ రజక సంఘం..



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని అడ్లూర్ గ్రామ రజక సంఘం అధ్యక్షుడిగా చిన్నగారి ప్రశాంత్, కార్యదర్శిగా ఎంకొల్ల సంతోష్, ఉపాధ్యక్షులుగా స్వామి, రవి, కోశాధికారిగా రాజు, సలహాదారులుగా గడ్డమీది మహిపాల్, ప్రతినిధులు మహేష్, ధరంపురి, రమేష్, సందీప్ ఎన్నికయ్యారు.

■ అంబేద్కర్ సంఘం..

తాడ్వాయి: అంబేద్కర్ సంఘం తాడ్వాయి గ్రామం అధ్యక్షుడిగా మెట్టు రాములును ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులతో కలసి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

జీవితంలో శతక పద్యాల ప్రాధాన్యత ఎనలేనిది



కామారెడ్డి అర్బన్: నిత్య జీవితంలో శతక పద్యాలు ఎంతో ప్రభావాన్ని చూపుతాయని ప్రముఖ గజల్‌కవి, కీర్తిపురస్కార గ్రహీత సూరారం శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో కవి సాసుబిల్లి తిరుమల తిరుపతిరావు రాసిన 'సాసుబిల్లి శతకము' , 'తిరుమల రాగగీతి శతకము' పుస్తకాలను సూరారం శంకర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజ జీవితంలో శతక పద్యాలు ఎనలేని ప్రాముఖ్యత కలిగి ఉంటాయన్నారు. సమాజంలోని దుశ్చర్యలను రూపుమాపే క్రమంలో తిరుమల తిరుపతిరావు రాసిన రెండు పుస్తకాలు ఉపయోగ పడుతాయన్నారు. సమావేశంలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ ప్రకృతి, మానవీయతను కలబోసి శతకాలు రాసినట్టుగా ఉందన్నారు. కార్యక్రమంలో తెరవే ప్రతినిధులు బి.నాగభూషణం, కొడీ రవీందర్, వైద్య శేషారావు, సుప్పని సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్దతు ధర కోసమే కొనుగోలు కేంద్రాలు



పోచారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్‌లో..

బాన్సువాడ రూరల్: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని దేశాయిపేట్ సొసైటీ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్ పేర్కొన్నా రు. ఆదివారం పోచారంలో ఉప సర్పంచ్ బలరాం నాయక్, నాయకులు సాయిరెడ్డి, విజయ్‌గౌడ్, గోప్యానాయక్‌లతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

మిర్జాపూర్‌లో..

నస్రుల్లాబాద్: మండలంలోని మిర్జాపూర్‌లో పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు.

విద్యా రంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న హన్మంత్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: విద్యా రంగాన్ని ప్రభుత్వం విస్మరిస్తోందని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ సేటీట్ (ఎస్‌టీయూటీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం దేవునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూనియన్ ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, పాఠశాలలో స్వచ్ఛ కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాములు, నాయకులు రాజేందర్, ఖలీమోద్దిన్, మధు, నటరాజ్, ముత్యాలు, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



నిజామాబాద్ పదో తరగతి మూల్యాంకన కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు



బిచ్కుందలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కామారెడ్డి అర్బన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్‌లో పదో తరగతి మూల్యాంకనం కేంద్రం వద్ద నిరసన చేపట్టినట్లు జిల్లా అధ్యక్షుడు పి.రాఘవరెడ్డి తెలిపారు. జిల్లా కార్యదర్శి బి.సంతోష్, ప్రతినిధులు కృష్ణవేణి, రామకృష్ణారెడ్డి, ఎం.రాంచంద్ర, సత్యనారాయణ, టి.భాస్కర్, దత్తాచారి, శ్యాం, సంజీవ్, సత్యం పాల్గొన్నారు.

బిచ్కుంద: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఆదివారం బిచ్కుందలో ర్యాలీ నిర్వహించి అనంతరం కామారెడ్డిలో తలపెట్టిన ఆందోళన కార్యక్రమానికి బయలు దేరి వెళ్లారు. అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కార్యదర్శి షేక్ అహ్మద్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం వర్తించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



బాన్సువాడ మండలం కొత్తాబాది పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

సదాశివనగర్/ఎల్లారెడ్డి/బాన్సువాడ రూరల్ / నిజాంసాగర్/ నాగిరెడ్డిపేట: మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సదాశివనగర్‌లోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు 556 మందికి గాను 462 మంది, ఏడు నుంచి పదో తరగతిలో చేరేందుకు 472 మందికి గాను 388 విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈవో రాజు, ఎంఈవో యోసెప్ తనిఖీ చేశారు. ఎల్లారెడ్డిలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 258 మందికి గాను 225 మంది, మిగిలిన తరగతుల్లో చేరేందుకు 194 మందికి గాను 164 మంది విద్యార్థులు హాజర య్యారు. బాన్సువాడ మండలంలోని కొత్తాబాదిలో 64మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ ఫకీరయ్య తెలిపారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట పాఠశాలలో ప్రవేశాల కోసం 368 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో నిర్వహించిన పరీక్షకు 329 మంది విద్యార్థులు హాజరయ్యారు.